ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెల చివరి వరకు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

● డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించగా, ఆ పరీక్ష పత్రాలను డీఈవో చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా చూసి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ పరీక్ష ద్వారా పోటీ పరీక్షల నిర్వహణపై అవగాహన వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సమీర్ , అక్రమ్, నాయకులు ప్రణయ్, ఆసిఫ్, రాజేందర్, ఘని షోయబ్, మారుతి పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ బిగించిన విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ సరఫరాపై యాక్షన్‌ప్లాన్

- జిల్లాలో రూ.7.50 కోట్లతో పనులకు శ్రీకారం
- వేసవిలో ఇబ్బందులు కలగకుండా చర్యలు
- నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ, 11 కేవీ లైన్లు ఏర్పాటు

జగిత్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేసేందుకు జిల్లా విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సమ్మర్ యాక్షన్‌ప్లాన్ అమలు చేయనుంది. ఎండాకాలంలో రైతులు, గృహ, వాణిజ్యపరమైన వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ ఆదేశాలతో ప్రణాళికలు రూపొందిస్తోంది. రూ.7.50 కోట్లతో విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే చర్యలకు శ్రీకారం చుట్టింది.

● ఓవర్ లోడ్ తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో కొత్త కనెక్షన్లు పెరిగాయి. మరోవైపు ఎండాకాలం ఇళ్లలో ఎయిర్ కండీషనర్ల వాడకం కూడా పెరుగుతుంది. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ వాడకంతో వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి లోవోల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 33చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానంగా అదనపు ట్రాన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లో పనులను పూర్తి చేయగా, ఇంకా 30ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టబోతోంది.

● 360 ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో 360 చోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల వేసవిలో ఇప్పటి వరకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గనుంది. ఆయా ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనుంది. ప్రధా నంగా వ్యవసాయ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి లైట్లకు సంబంధించి వీటి అవసరం ఉన్నట్లు అధికా రులు గుర్తించారు. ఇప్పటికే 200 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించగా మిగతా 160 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగవు. వేసవిలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి వంటి పట్టణ ప్రాంతా ల్లో ఏసీల వాడకం బాగా పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాలతో పాటు గృహాల అవసరాలకు విద్యుత్ వాడకం పెరుగుతున్నందున డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు.

● 13 ప్రాంతాల్లో లింకు లైన్లు

జిల్లాలోని 13 ప్రాంతాల్లో 33 కేవీ లైన్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతోంది. 13 లైన్ల పరిధిలో ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు ఇంటర్ లింక్...

మిగతా 8లో

విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం త్వరలో విపత్తు నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం జాతీయ విపత్తు నివారణ బృందం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణ, తక్షణ చర్యలు, సహాయ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ప్రకృతి విపత్తులు, ముఖ్యంగా వరదలు, భూకంపాలు, తుఫాన్‌లవంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తు సమయంలో ప్రజలను రక్షించే విధానాలు, సహాయ చర్యలు, అత్యవసర సేవలు అందుబాటులో మెరుగుపరుచడం, విపత్తు నివారణ చర్యలపై ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. గత అనుభవనాలను పరిగణనలోకి తీసుకుని విపత్తు నిర్వహణలో మెరుగైన విధానాలను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి ముఖేష్ కుమార్, ఆర్డీవో మధుసూదన్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి హన్మంతరావు పాల్గొన్నారు.

'క్యాన్సర్ నియంత్రణకు చర్యలు'



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. ప్రతి ఒక్కరు క్యాన్సర్ రాకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులు, కల్తీ వస్తువులు వాడవద్దని తెలిపారు.

నాణ్యమైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సంఘం అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, పీపీ ప్రణయ్, డాక్టర్ అంజిత్‌రెడ్డి, న్యాయవాదులు రాంబాబు, వెంకట నర్సయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, శ్రావంతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు విమర్శించారు. జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఇందిరా భవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు మాట్లాడారు. ప్రధానీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్ అంటూ రూ.62 లక్షల కోట్ల అప్పులను రూ.181లక్షల కోట్లకు పెంచారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్ నిర్మాణం కోసం కేంద్రానికి రూ.లక్ష అరవై కోట్ల ప్రతిపాదనలు పంపినప్పటికీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గత యేడాది రూ.30 వేల కోట్లు కేటాయించగా ప్రస్తుత యేడాది రూ.20 వేల కోట్లకు తగ్గించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయ లక్ష్మీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజెంగి నందయ్య, ఎండీ షాకీర్ సిద్ధిఖీ, జిల్లా గంగాధర్, రఘువీర్, దుర్గయ్య, జయశ్రీ, శోభారాణి, నిశాంత్ రెడ్డి, రాజేశ్, స్వామిరెడ్డి, రాకేశ్, మధు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి వినూత్న రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జగిత్యాలలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి బాబు



జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మెట్‌పల్లికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రాచకొండ యాదగిరిబాబును నియ మిస్తూ జిల్లా ఎన్నికల అధికారి కేవీఎల్ఎన్‌రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా, రెండు పర్యాయాలు ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కోశాధికారిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ పార్టీ పదవుల్లో పనిచేశారు. పార్టీ తరుపున వేసిన పలు కీలక కమిటీలకు చైర్మన్‌గా వ్యవహరించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర పార్టీకి, పార్టీ శ్రేణులకు ఆయన కృత జ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నైపుణ్య శిక్షణ తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. విద్యార్థులు తమ నైపు ణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ , ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.వాసవి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య పాల్గొన్నారు.

బావాజిపల్లిని గ్రామ పంచాయతీ చేయాలి

● ఎమ్మెల్యేకు గ్రామస్థుల వినతి


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసిన బావాజిపల్లి గ్రామస్థులు

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి అనుబంధ గ్రామం బావాజిపల్లిని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని బావాజిపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గ్రామ పంచాయతీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలి

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతులు సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమానికి మద్దతు పలకాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాస గృహంలో కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు తమ కార్యక్రమం విజయవంతానికి సహక రించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దుమాల గంగారాం, భువనగిరి కిషన్, నక్క రమేష్, రాజ్ కుమార్, భోనగిరి నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదం అందజేశారు.

అనంతరం గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలి సి భోజనం చేశారు. జగ్గసా గర్ గ్రామంలో మీసేవా కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



- ఘనంగా వసంత పంచమి వేడుకలు

8

నూకపల్లి సరస్వతి ఆలయంలో

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- విజేతలకు బహుమతుల పంపిణీ

8

ఓటరు జాబితా విడుదల


జాబితా ప్రదర్శిస్తున్న పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కొడిమ్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో స్వరూప గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా అదనపు చేర్పుల ముసాయిదాను నోటీసు బోర్డుపై ప్రకటించారు. ఈ ముసాయిదా ప్రకటనపై మంగళ వారం రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

●పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల ఓటరు జాబితాను ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. వార్డుల వారీగా ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి ఫొటో ఓటరు లిస్టు జాబితాను గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డులపై అతికించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలని వినతి

బుగ్గారం ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలంలో 6 ఎంపిటిసి స్థానాలను 9 స్థానాలుగా పెంచాలని మండల బీ ఆర్ఎస్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు.జనాభా పెరిగిన సందర్భంగా బుగ్గారంలో రెండు ఎంపీటీసీ స్థానాలు, షేకళ్ళ గ్రామానికి ప్రత్యేక ఎంపీటీసీ స్థానం, గంగాపూర్ యశ్వంతరావుపేట్ గ్రామానికి ప్రత్యేక ఎంపీటీసీ స్థానం పెంచాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, యూత్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, నాయకులు దాసరి లచ్చయ్య, ఎరవేణి రంజిత్, లింగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది అర్జిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరిం చాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

●కోరుట్ల పట్టణానికి చెందిన అబ్దుల్ జలీల్ అనే వ్యక్తి 20 రోజుల క్రితం రూ. 1.46 లక్షల విలువ గల ఆపిల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్‌ను రికవరీ చేశారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితుడికి ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం కీలకం

పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకమని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గత 15 రోజులుగా సాయుధ బలగాల డీ-మొబిలైజేషన్ కార్యక్ర మాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజు ముగింపు కార్యక్రమానికి ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో వివిధ విభాగాలతో పాటు ఏఆర్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు.

పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణ కలిగి ఉండి, బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీమ్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, రామకృష్ణ, వేణు తదితరులు ఉన్నారు.

అటవీ ప్రాంతంలో దినసరి కూలీ ఆత్మహత్య

● నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు అనుమానం



సురేశ్‌నాయక్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో దినసరి కూలీ బానోతు సురేశ్‌నాయక్(35) అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మం డలం కిష్టునాయక్ తండాలో సోమవారం వెలుగు చూసింది. నాలుగు రోజుల క్రితం గ్రామశివారులో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సురేశ్‌నాయక్ దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో నాలుగురోజుల క్రితం సురేశ్‌నాయక్ భార్య సుజాత ఇద్దరుపిల్లలను తీసుకుని కామారెడ్డిజిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపంచెందిన సురేశ్‌నాయక్ తనబైక్‌పై గ్రామశివారులోని ఎర్రగుట్ట ప్రాంతానికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెలు, మేకల కాపారులకు బైక్ కనిపించడంతో పాటు దుర్వాసన రావడంతో అక్కడకు చేరుకున్నారు. స్థానిక పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల సహాయంతో సురేశ్‌నాయక్‌గా గుర్తించారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు, తల్లి సరోజన ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొడిమ్యాలలో యువకుడు..

కొడిమ్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిర్ర సంతోష్(25) సోమవారం అప్పుల బాధతో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సౌందర్య తెలిపారు. మృతుడి తల్లి చిర్ర మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆస్తి పంపకాల్లో వచ్చిన డబ్బు అప్పులకు సరిపోని కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకొని ఒకరు..

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి అశోక్‌రెడ్డి(45) 15ఏళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లోఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామంలో అప్పుల బాధతో అల్లె సాగర్ (28) అనే యువకుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ కథనం మేరకు సాగర్‌కు మూడు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య రెండు నెలల గర్భిణి. నెల రోజుల క్రితం తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. ఇటీవలే ఓ ఇంటిని కూడా కొనుగోలు చేశారు. వివాహం, ఇంటి అప్పు రూ.6 లక్షలు కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి సోమవారం గల్ఫ్ నుంచి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాపు పక్కన గల పర్మిట్ రూంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిసిన వివరాల ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన తీపిరి నారాయణ(53) సోమవారం వేకవ జామున పర్మిట్‌రూంలోకి వెళ్లాడు. ఉదయం ఎనిమిది గంటలకు అందులో పనిచేస్తున్న వ్యక్తి వచ్చే సరికి అచేతన స్థితిలో పడిపోయినట్లు తెలిపారు. ఫిట్స్‌తో , లేదా గుండెనొప్పితో చనిపోయినట్లు మృతుని కొడుకు శ్రీకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సోమవారం పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది పట్టుకున్నారు. కోదండరామాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బోలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల పీడీఎస్‌బియ్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బియ్యం, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ తనిఖీల్లో మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

● బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధితురాలికి రూ2 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనంప్రకారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ బాలికపై 2020సంవత్సరంలో సుంకల శ్రీనివాస్(21) అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల టౌన్ సీఐ జయేష్‌రెడ్డి నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సోయాక్ట్‌ల కింద కేసునమోదు చేయగా డీఎస్పీలు ప్రకాష్, వెంకటరమణ విచారించారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్‌స్పెషల్‌కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు తమవాదనలు వినిపించగా నేరంరుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

వరకట్నం వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ సోమవారం తీర్పు వెలు వరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గాలిపెల్లి అంజయ్యకు 25ఏళ్ల క్రితం మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన నీరజతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ అంజయ్య తన భార్య నీరజను తరచుగా వేధించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నీరజ 2020 మార్చి 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంత బాధిత కుటుంబ సభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.



శాతవాహనలో ప్రక్షాళన జరిగేనా?

● పరీక్షల నియంత్రణ విభాగంపై ఫిర్యాదులు ● కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వైరీ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఏ విశ్వవిద్యాలయానికి అయినా పరీక్షల నియంత్రణ విభాగమే కీలకం. శాతవాహన విశ్వవిద్యాలయంలో పేపరు లీకేజీ, పరీక్షల జవాబు పత్రాల డిజిటలైజేషన్ స్కానింగ్ టెండర్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. విశ్వవిద్యాలయానికి కొత్త ఉప కులపతి వచ్చినా పరీక్షల నియంత్రణ విభాగం ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు.

గత వీసీ హయాంలో ఓ అధికారి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆయన హయాంలో జరిగిన డిగ్రీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ పెను సంచ లనంగా మారింది. దీనిపై అప్పటి ఉపకులపతి, రిజిస్ట్రార్ ఒక కమిటీ వేశారు. ఆ విచారణ ముందుకు సాగలేదు.

జవాబు పత్రాల డిజిటలైజేషన్‌పై ఫిర్యాదులు

గత వీసీ హయాంలో కోసిన్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థకు నామినేటెడ్ పద్ధతిలో జవాబు పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియను అప్పజెప్పారు. ఇలా నాలుగు విద్యాసంవత్సరాలకు సంబంధించిన పరీక్షలను మూల్యాంకనాన్ని ఆ సంస్థ ద్వారానే కొనసాగించారు. నిబంధనల ప్రకారం ఐదు లక్షల రూపాయలకు మించిన ఏ పనిని అయినా టెండర్ నిర్వహించి అప్పజెప్పాలి.

ఒక విద్యా సంవత్సరంలో రెం డు సెమిస్టర్ల ద్వారా జరిగే యూజీ, పీజీ, ప్రొఫెషనల్ పరీక్షల జవాబు పత్రాలు లక్షల్లో ఉంటాయి. వీటి డిజిటలైజేషన్‌కు కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ ప్రక్రియను నామినేటెడ్ పద్ధతిపై ఒక సంస్థకు అప్పజెప్పడం పలు అనుమానాలకు దారి తీసింది. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు సామాజిక కార్యకర్తలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడంతో అప్పటి వీసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సరైన స్పందన రాలేదనే సాకు మళ్లీ అదే సంస్థకు నామినేషన్‌పై అప్పజెప్పారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆదేశాలతో ఒక కమిటీని నియమించి పరీక్ష జవాబు పత్రాల డిజిటలైజేషన్ కోసం టెండర్ నోటిఫికేషన్‌ను జనవరి 17న ఇచ్చారు.

చర్యలు ఉంటాయా?

పరీక్షల నియంత్రణ విభాగం, విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాల మీద సామాజిక కార్యకర్తలు పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది. గతలో పని చేసిన అధికారులు ఈ విచారణకు సహకరించ లేదనే విమర్శలున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. అన్ని రకాల అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసు ఉన్న బాలుడు చేకూటి మోక్షిత్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వాహనంలో సిరిసిల్లకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. నిజామాబాద్‌కు చెందిన చేకూటి మమత తన పిల్లలను తీసుకుని హరిదాస్‌నగర్ గ్రామానికి బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి వచ్చింది. ఆమె కొడుకు మోక్షిత్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన వడ్లకొండ లక్ష్మయ్య అనే గీత కార్మికుడు ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కింద పడగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి లక్ష్మయ్యను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెళ్లి చేసుకోవాలని యువతి న్యాయ పోరాటం



బిడ్డతో కలిసి న్యాయ పోరాటం చేస్తున్న శిరీష

ధర్మారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన వ్యక్తి వివాహం చేసుకోవాలని 8 రోజులుగా ఓ మహిళా అతడి ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తున్న ఘటన మేడారంలో చోటుచేసుకుంది. మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆవుల శిరీషకు మేడారం గ్రామానికి చెందిన రాచూరి వెంకటేష్‌లు ప్రేమించుకున్నారు. అనంతరం శిరీషకు హన్మకొండకు చెందిన వ్యక్తితో వివాహం కాగా వెంకటేష్ శిరీష భర్తకు ఫోన్ చేసి విడాకులు ఇవ్వాలని కోరాడు. విడాకుల అనంతరం శిరీష వెంకటేష్ ఇంట్లో ఉంటూ రెండు సంవత్సరాలుగా సహజీవనం చేస్తోంది. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని శిరీష వెంకటేశ్‌ను ఒత్తిడి చేసింది. ఈ విషయంలో ఇరువురి మధ్య నెలరోజులుగా గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో శిరీష తల్లిగారు ఇళ్లు బొట్లవనపర్తికి వెళ్ళింది. గత నెల 26న శిరీష పెద్ద మనుషులతో కలిసి వెంకటేష్ ఇంటికి వెళ్ళగా తాళం వేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి శిరీష వెంకటేష్ ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తోంది. ఎనిమిది రోజులుగాకూతురుతో బొట్లవనపర్తి నుంచి వెంకటేశ్ ఇంటికి ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండి వెళుతోంది. వెంకటేష్ సామాజికవర్గమైన మున్నూరు కాపు సోదరులారా నాకున్యాయం చేయండి, మేడారం గ్రామప్రజలారా న్యాయం చేయండి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తోంది. వెంకటేశ్‌తో వివాహం అయ్యే వరకు పోరాటం చేస్తానని, తన చావైనా బతుకైన వెంకటేశ్‌తోనే అని పేర్కొంది. అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతోంది.

తాత వద్దకు చేరిన ధృవన్

● అప్పగించిన ఏఎస్పీ శుభం ప్రకాష్

● పోలీసుల అదుపులో నిందితులు?



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండన్నపల్లి గ్రామశివారులో గతనెల27న హత్యకుగురైన మమత కొడుకు ధృవన్ క్షేమంగా ఉన్నాడు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయంలో ఏఎస్పీ శుభం ప్రకాష్ సోమవారం బాలుడిని తాత, నానమ్మలకు అప్పగించారు. అనంతరం ఆయన సంఘటన వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఖాసీంపేటకు చెందిన మమత (25), భరత్ ఆరేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమారుడు ధృవన్ ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో నాలుగు నెలల నుంచి వేరుగా ఉంటున్నారు. మమత తన కొడుకుతో మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. గత నెల 25న బంధువుల ఇంటి నుంచి మమత ఆమె కొడుకుతో సహా బయటకు వెళ్లింది. అనూహ్యంగా కొండన్నపల్లి శివారులో హత్యకు గురైంది. మమత వెంట ఉన్న బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. చెన్నైలో ఒకహోటల్‌లో ఉన్న నిందితులతో పాటే బాలుడు ఉన్నట్లు గుర్తించారు. పథకం ప్రకారం ఆదివారం వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా అప్రమత్తమైన నిందితులు బాలుడిని హోటల్ గదిలో వదిలేసి పారిపోయారు. బాలుడిని కరీంనగర్ తీసుకొచ్చి నానమ్మ, తాతయ్య మేడ రాంచందర్, లక్ష్మికి అప్పగించామని ఏఎస్పీ తెలిపారు. కేసు విచారణ కొనసాగుతున్నదని, మమత హత్యకు కారణమైన నింది తులను త్వరలో పట్టుకుంటామని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని వివరించారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు, వారిలో ఒక మహిళ ఉన్నట్లు తెలుస్తోంది.

అఘోరీ హల్‌చల్

● వేములవాడకు వెళ్తుండగా సిరిసిల్ల జిల్లా సరిహద్దులో అడ్డుకున్న పోలీసులు ● మూడు గంటల పాటు ఉద్రిక్తత



అఘోరీని సిద్దిపేట వైపు తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆలయంలోని దర్గాను కూల్చి వేస్తానని అఘోరీ సోమవారం వేములవాడకు వెళ్తుండగా పోలీసులు జిల్లా సరిహద్దులో అడ్డుకున్నారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన అఘోరీ ఫిబ్రవరి 3వతేదీన వేములవాలోని దర్గాను కూల్చి వేస్తానని సంచలన వాఖ్యలు చేయడంతో పోలీసులు ముంద స్తుగా జిల్లా సరిహద్దుతోపాటు తంగళ్లపల్లి, జిల్లెల్ల ప్రాంతాల్లో ప్రత్యేకపోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. అఘోరీ ప్రకటించిన విధంగానే సోమవారం సాయంత్రం వేముల వాడకు వస్తుండగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దులో అఘోరీని పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ కారులోనే కూర్చోగా పోలీసులు కారును చుట్టుముట్టారు. సుమారు మూడు గంటల పాటు కారులోనే ఉన్న అఘోరీ పోలీసులు నచ్చజెప్పినప్పటికీ కారుదిగలేదు. పోలీసులు రికవరీ వ్యాన్‌ను తెప్పించి కారును అఘోరీతో పాటు సిద్దిపేట వైపు తరలించారు. అఘోరీని చూడడానికి ప్రజలు ఆసక్తి చూపడంతో రోడ్డుపై వాహనాలు నిలిచి పోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వేములవాడలో పోలీసుల బందోబస్తు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలోని ఫిబ్రవరి 3వతేదీన దర్గాను కూల్చివేస్తానని అఘోరీ చేసిన వాఖ్యలతో వేములవాడలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం అఘోరీ వేములవాడకు వస్తుండగా జిల్లా సరిహద్దులో పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ వ్యాఖ్యలు స్థానికంగా ఉత్కఠ రేపుతున్నాయి. పోలీసులను తప్పించుకుని అఘోరీ వేములవాడకు చేరుకుంటుందా అనే చర్చ జరుగుతోంది.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



వడుకాపూర్ గ్రామ శివారులో ప్రమాదానికి గురైన కారు

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ శివారులో సోమవారం రాత్రి కరీంనగర్‌కు వెళ్తున్నకారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్ళింది. మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోయి కారు సమీప పొలాల్లోకి దూసుకువెళ్ళిందని స్థానికులు తెలిపారు. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని, కారుకు మాత్రం ముందు భాగం దెబ్బతిన్నదని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరూ గాయపడలేదని ఏఎస్ఐ చంద్రమౌళి పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బెజ్జంకి మహేష్(22) హత్యకేసు నిందితులను పోలీసుల అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బొమ్మకల్‌లోని పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామానికి చెందిన మహేష్, సతీష్ మరో ఇద్దరు స్నేహితులు కలిసి ఆదివారం మధ్యాహ్నం మద్యంతాగారు. గ్రామంలో నెల రోజులకిందట వివాహేతర సంబంధం బయట పడిన విషయంవారి మధ్యచర్చకు వచ్చింది. తనతోనే ఉంటూ వివాహేతరసంబంధం బయట పెట్టావంటూ సతీష్ అనేవ్యక్తి ఆవేశానికిలోనై బెజ్జంకి మహేష్‌ను బీరుసీసాతో గొంతుకోసి హత్యచేశాడు. మహేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో సతీష్‌తో పాటు మరోఇద్దరిపై కరీంనగర్‌రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ మృతదేహానికి సోమవారం కరీంనగర్‌ప్రభుత్వాస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో గొడవలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామానికిచెందినస్వాతి(36)చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలిభర్త మద్యానికి బానిస కాగా ఎన్ని సార్లు చెప్పిన వినకపోగా అతనిపై విసుగుచెంది ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. మృతు రాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పట్టపగలే చోరీ

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి) మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన దుంపెట తిరుపతి ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం తిరుపతి బంధువు వివాహం అదేగ్రామంలో జరగగా అక్కడికి వెళ్ళి ఇంటికి తిరిగివచ్చారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని లక్షరూపాయల నగదును ఎత్తుకె ళ్లారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేంపల్లి చెరువులో మొసలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి గ్రామంలోని చెరువులో మొసలి ప్రత్యక్షమైంది. సోమవారం ఉదయం చెరువు ఒడ్డున మొసలి సంచరిస్తుండగా అటు వైపు వెళ్తున్న రైతులకు కనిపించడంతో వారు భయాందోళనలకు గురయ్యారు. నాలుగు రోజులు చెరువు పరిసరాల్లో మొసలి సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



వేంపల్లిలోని చెరువులో మొసలి

గన్నేరువరం వీవోఏ తొలగింపు

గన్నేరువరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన హరిప్రియ గ్రామైక్య సంఘం వీవోఏగా విధులు నిర్వహిస్తున్న న్యాత పుష్పలతను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగుపథకాల గ్రామసభలో తాను ఉద్యోగురాలి నని మరచిన వీవోఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తనకు పథకాలు రాలే దంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ రాహి త్యంగా వ్యవహరించినందుకు గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించి ఆమెను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు, ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్

● బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు మొండి చేయి
● జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి



మాట్లాడుతున్న శీలం స్వామి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలను అణగదొక్కుతూ ధనవంతులను ఇంకా ధనికులుగా చేసే విధంగా ఉందని ఆరోపించారు. మధ్య తరగతి ప్రజల నుండి పన్నుల రూపేణా రూ 52 లక్షల65వేల 300 వసూలు చేసే దిశగా అడుగు పెట్టి అందులో నుండి పేదలకు 12లక్షలకోట్లు ఖర్చుపెట్టి మిగితా లక్షలకోట్లను దేశంలో ఉన్నటు వంటి కార్పొరేట్ శక్తులకు, ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు ఖర్చు చేసే దిశగా వెళుతున్నారన్నారు.దేశంలో బీసీ , ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను మోసం చేసే దిశగా బడ్జెట్ ఉందని జీఎస్టీ రూపంలో, ట్యాక్స్‌ల రూపంలో వేలకోట్లు కేంద్రం తీసుకుంటూ తెలంగాణకు మొండి చేయి చూపారన్నారు.

క్యాన్సర్‌ను జయిద్దాం

● ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రయోజనం
● వ్యాధిపై జాగ్రత్తలు అవసరం
● నేడు ప్రపంచ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

క్యాన్సర్ వచ్చింది.. ఇక జీవితం ముగిసిపోతుందని చింతించాల్సిన పని లేదు. గుండె నిబ్బరంతో పోరాటం చేయవచ్చు. అప్రమత్తతతో తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఎంతో మంది క్యాన్సర్ బారిన పడి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ తమ జీవితకాలాన్ని పొడిగించుకున్న వాళ్లు ఉన్నారు. పూర్తిగా క్యాన్సర్‌ను దూరం చేసిన వాళ్లూ ఉన్నారు. తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తించకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నది వాస్తవమే. క్యాన్సర్ అంటే ఇక జీవితం నుంచి క్యాన్సిల్ కాదని వైద్య నిపుణులు చెపుతున్నారు. ప్రధానంగా నోటి క్యాన్సర్, గొంతు, ఊపిరి తిత్తులు, జీర్ణకోశ క్యాన్సర్‌తో మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. పురుషులు ఎక్కువగా పొగత్రాగడం, పొగాకు నమలడం, మద్యపానం వల్ల నోటి క్యాన్సర్ వస్తోంది.





క్యాన్సర్ అంటే..

శరీరంలో కణవిభజన నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఏ రకమైన కణాలు ఎంత వేగంగా విభ జన జరుగాలి. అనే దాన్ని కణం యొక్క కేంద్రంలోని క్రోమోజోముల్లోని ఒక జన్యువు ఉంటుంది. దీన్ని రెగ్యులేటర్ జీన్‌గా పిలుస్తారు. ఏ కారణం చేతనైనా ఈ రెగ్యూలేటర్ జీన్ మాట వినకపోతే కణాలు అదుపులేకుండా విభజన జరుగుతాయి. క్రమ పద్ధతి లేనందున కణాలకు రక్తం సరఫరా సరిగా ఉండదు. రక్తం సరిగా అందని ప్రాంతం కుల్లిపోవడం జరుగు తుంది. ఇది శరీరంలో ఏ అవయవానికైనా జరగ వచ్చు. దీన్ని క్యాన్సర్ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. కొంత మంది కుటుంబంలో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా గుర్తించారు. వృత్తు ల వారీగా వస్తున్న క్యాన్సర్లు కూడా ఉన్నాయి. ఈ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే కొంత వరకైనా ప్రాణాలు కోల్పోకుండా రక్షించుకోవచ్చు.

నేపథ్యం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్‌ను నివారించవచ్చని గుర్తించింది. 2000ల సంవత్స రంలో పారిస్‌లో జరిగిన సమావేశంలో ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపాలని నిర్ణయించారు. 2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదు అవుతాయని భావిస్తున్నారు. కేసులు పెరుగుతున్న సందర్భంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించి అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 12శాతం ఉంది. రాబోయే 10సంవత్సరాల్లో 80మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

ఎలా వస్తుంది..

క్యాన్సర్ శరీరంలో ఏ అవయవానికైనా రావచ్చు. సాధారణంగా కొంత మంది కుటుం బంలో కొన్ని రకాల క్యా న్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వాళ్లను గుర్తించి ముందుగా పరీక్షలు చేయిస్తే కొంత మేరకు ప్రాణా లను రక్షించవచ్చు. గనుల పరిశ్రమ, పెయింటింగ్, రసాయనాల పరిశ్రమల్లో పనిచేసే వారికి క్యాన్సర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మనం తినే తిండి నీటిలో కలిసి ఉన్న రసాయనాలు కూడా క్యాన్సర్‌ను తెచ్చి పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పొగ తాగడం వల్ల ఊపిరి తిత్తుల్లో, అన్నవాహికకు, మల ద్వారం, ఇలా ఎక్కడైనా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిర్ధారణ అయ్యింది. వందలో 24శాతం పొట్టలో అన్న వాహికకు క్యాన్సర్లు వస్తున్నాయని, 16శాతం ఊపిరి తిత్తుల్లో, 15శాతం రొమ్ముకు, పేగు లకు, ఊపిరితి త్తులకు, రొమ్ములకు కలిసి 100లో 50శాతం క్యాన్సర్లు కనిపిస్తాయి. 13శాతం మూత్ర కోశం, మూత్ర పిండాలు, చర్మానికి 9శాతం, గర్భసంచి, గర్భసంచి ముఖ ద్వారంలో నూ, అండాశ యాల్లోనూ క్యాన్సర్ నూటికి 9వంతులు ఉంటుంది. మిగితా అన్ని అవయ వాలకు 14శాతం ఉంది.


లక్షణాలు..

క్యాన్సర్ గుర్తించడానికి కొన్ని లక్షణాలను గమనం లోకి తీసుకోవా లి. దగ్గితే రక్తం పడడం, మూత్రంలో రక్తం పడడం, మలంలో రక్తం కనిపించడం, మల విసర్జనలో మార్పు లు, యోనిద్వారంలో రక్తం పోవడం, బహి ష్టులో యోని ద్వారం గుండా రక్తం పోవడం, మెనోపాజ్ తరువాత రక్తం పోవ డం భార్య భర్తలు కలిసిన తరువాత రక్తం పోవడం, చాలా కాలంగా తగ్గకుండా ఉండే దగ్గు, రొమ్ములో గడ్డ, మెడలో గడ్డలు, చాలా కాలంగా మానకుండా ఉండే పుండ్లు, ఎలాంటి కారణం లేకుం డా అలసట, బరువు తగ్గి పోవడం, అన్నం తినలేక పోవడం వంటి లక్షణాలను బట్టి క్యాన్సర్‌ను కూడా అనుమానించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంది. పొగ తాగడం మానేయడం, ఎక్కువగా పీచు ఉండే పదార్థాలు తింటే పేగుల్లో క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చు. పోషకాహారం తీసుకోవాలి. పెరిగే పిల్లలకు కాల్షియం అధికంగా ఉన్న ఆహార పదార్థాలు అవసరం. ఆకుకూరలు, ఇతర కూరలు, పండ్లు సమృద్ధిగా వాడాలి. విటమిన్-ఏ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తినాలి. వంట నూనెలు, మాంసం వంటి పదార్థాలు తగ్గించాలి. ఉప్పు పరిమితంగా వాడాలి. వనస్పతి, నెయ్యి, వెన్న చాలా అరుదుగా వాడుకోవాలి.





కార్పొరేట్, రియల్టర్లకు డిపాజిట్ దక్కద్దు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయఎమ్మెల్సీ స్థానానికి కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులు, రియల్ ఎస్టేట్ చేస్తున్న మిత్రులు పోటీ చేస్తున్నారని, వారికి డిపాజిట్ దక్కదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు తెలుస్తాయన్నారు. తాను 30సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, జిల్లా నోడల్ అధికారిగా పనిచేశానని, ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా అనుభవం ఉందని అన్నారు. మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తిగా తనకు ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసునన్నారు. అందుకనే ఇంటర్ జేఏసీ, ఎస్‌టీయూ జేఏసీ, తెలంగాణ పీఆర్‌టీయూ జేఏసీ పక్షాన, ఉపాధ్యాయ, అధ్యాపక ఉమ్మడి అభ్యర్థిగా మరోసారి నామినేషన్ వేసినట్లు చెప్పారు. మనఉన్నతికి ఉపాధ్యాయ వృత్తికి ఇంకా విలువతెచ్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకనే వారిని డిపాజిట్ లేకుండా ఓడించాలని అన్నారు.

దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



నూతనంగా నిర్మితమయ్యే సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏసీ నాయిని సుప్రియతో ఈవోలు, సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నూతన కార్యాలయ భవనం సోమవారం ప్రారంభమైంది. సుమారు 25 సంవత్సరాలుగా కోర్టు వద్ద రాజరాజేశ్వర కల్యాణమండపం మొదటిఅంతస్తులో కార్యకలాపాలు కొనసాగేవి. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాలు, సౌకర్యాల విషయాలను దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కల్యాణమండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చేందుకు నిర్ణయించారు. కొన్ని నెలలుగా అన్ని వసతులతో కూడిన నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా కొంతపని మిగిలి ఉండడంతో ఈ నెల12నుంచి కార్యాలయం పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. వసంతపంచమి సందర్భంగా భవనంలో సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పుణ్యాహవాచనంలో పాల్గొన్నారు. భవనాన్ని ప్రారంభించి మొక్కను నాటారు.

జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పేసరి అజయ్(ఎస్సారార్ డిగ్రీకళాశాల), మనీషా, ప్రియాకుమారి(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల) ఎంపికైనట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం చైర్మన్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. పశ్చిమగోదావరిజిల్లా నరసాపురంలోని వైఎన్‌రెడ్డి కళాశాలలో ఈనెల3నుంచి9వరకు కొనసాగేశిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50మందివలంటీర్లు పాల్గంటున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వలంటీర్లను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు పడాల తిరుపతి, సుజాత, అర్జున్, ఎలిజబెత్ రాణి, రాజేశం, రాపర్తిశ్రీనివాస్, సంగీతా రాణి, శ్రీలత అభినందించారు.



జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటున్న శాతవాహన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు

● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. నర్సక్కపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు శ్రీనివాస్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడం, పెట్టుబడి సాయం అందకపోవడంతోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే అని, రైతులు మనోధైర్యం కోల్పోవద్దని బీఆర్ఎస్ అండ గా నిలుస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో జడ్పీమాజీ వైస్ ఛైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు జితేందర్‌గౌడ్, మీసరగండ్ల అనీల్‌కుమార్, గొట్టెపర్తి పర్శరాం, సావనపెల్లి అనీల్‌కుమార్, సాదుల్, రాగటి రమేష్, మల్యాల రాజశేఖర్, రాజారాం, కూనబోయిన రఘు, శ్రావణ్‌కుమార్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

● తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1931 లెక్కల ప్రకారం దేశంలో 52శాతం బీసీలు ఉండగా, అప్పటినుంచి ఇప్పటివరకు బీసీల జనాభా పెరిగి 70శాతం చేరిందన్నారు. గతంలో బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుల సర్వేలో 58శాతం బీసీలను చూపించి మోసం చేయగా, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేసుకుంటూ వచ్చాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అయిలయ్యగౌడ్, సదానందంగౌడ్, అయిలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ!

● తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు..
● ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు

కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సోమవారం ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీకాగానే పట్టభద్రుల స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయుల స్థానానికి ముగ్గురు అభ్యర్థులు ఐదునామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలు రెండింటికి నామినేషన్ వేశారు. పట్టభద్రుల స్థానంలో సిలివేరి శ్రీకాంత్(జమ్మికుంట), గవ్వల లక్ష్మి (దేవునిగూడెం), చాలిక చంద్రశేఖర్(హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ(ఆదిలాబాద్), కంటెసాయన్న (మేడ్చల్), దూడ మహిపాల్(ధర్మపురి) నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయుల స్థానానికి సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్, కూర రఘోత్తంరెడ్డి(గోనెపల్లి) నామినేషన్లు వేశారు. సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్ అటు పట్టభద్రుల స్థానానికి, ఇటు ఉపాధ్యాయుల స్థానానికి నామినేషన్లను దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈ నామినేషన్లను స్వీకరించారు.

● **10 వరకు నామినేషన్ల స్వీకరణ**

ఎమ్మెల్సీ ఎన్నికలఅధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ రెండు ఎమ్మెల్సీస్థానాలకు తాను రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నానని, ఈనెల 10వతేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 8,9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, మిగతా పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి పూర్తికాగానే ఫలితాలుప్రకటిస్తామని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సందేహాలను నివృత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

ధర్మపురి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి (యోగ,ఉగ్ర) వారల సేవలను మంగళవాయిద్యాలు వెంటరాగా పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇసుక స్తంభంవద్ద గల మండపంలో స్వామివారలను ఆశీనులు చేసి వేదమంత్రాల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. దూర ప్రాంతాలకు చెందిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.



ఇసుక స్తంభం వద్ద స్వామి వారలకు వసంతోత్సవ పూజలు



ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి వారలకు హారతి పూజలు

భక్త జనసంద్రంగా వేములవాడ

● భక్తులతో కిక్కిరిసిపోయిన లైన్‌లు ● 300 మంది వరకు శివదీక్ష తీసుకున్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. వసంత పంచమిని పురస్కరించుకుని పరమశివుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 3 గంటల నుంచే శివదీక్ష స్వాములు రాజన్న దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం 4.30 గంటలనుంచి లోకల్ భక్తులు రాజన్నదర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరగా ఇతరప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చిన భక్తులు ముందుగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారు నాలుగు గంటల పాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ ఏఈవో అశోక్ సూపరింటెండెంట్ వరి సర్సయ్య, నరేందర్, రాజేందర్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మొదలైన శివదీక్షల స్వీకరణ..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలంలో శివదీక్షలు ప్రారంభమయ్యాయి. వసంత పంచమిని పురస్కరించుకుని శివభక్తులు సోమవారం తెల్లవారు జామున శ్రీరాజరాజేశ్వర స్వామి అభిషేక పూజలో పాల్గొని మాలాధారణ చేసుకునేందుకు తరలివచ్చారు. శివస్వాముల ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ అభిషేక మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో దాదాపు 300మంది శివభక్తులు మాలధారణ ధరించారు.

ప్రతియేటా శివరాత్రి ముందు శివుడికి మండల, అర్ధ మండల దీక్ష మాలధారణ చేసి, శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో మాల విరమణ చేస్తారని ప్రధాన అర్చకులు ఈశ్వరగారి సురేష్, వాసలమర్రి గోపి, తమ్మల భీమన్న తెలిపారు.

రేపు రాజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య ఉదయం 8 గంటల నుంచి హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు



రాజన్న ఆలయంలో శివదీక్ష స్వీకరిస్తున్న భక్తులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగులో గల 132 కేవీ సబ్ స్టేషన్‌లో పెండింగ్ పనుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సింధూర్ శర్మ తెలిపారు. అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, వీరాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని ఎంపీడీవోకు పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం సమర్పించారు. విధుల్లో పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, కుంబాల శ్రీనివాస్, గాజెంగి రాజేశం, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, కడకుంట్ల అభయ్ రాజ్, సిలివేరి రమేష్, మాచర్ల మహేష్, ఊసకోల రాము, బెజ్జంకి హరికృష్ణ, ద్యావనపెల్లి సురేష్, తాటిపాముల రమేష్‌లు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన చిన్నారులు

భీమారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన గుట్ట వంశిక, వడ్లకొండ అక్షితలు తెలంగాణ సాంప్రదాయ పేరిణి నృత్య ప్రదర్శనలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికయ్యారు. మెట్‌పల్లి పట్టణంలో తెలుగు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మీనాక్షి కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విశత పేరిణి నృత్యోత్సవం-2025లో భాగంగా ఒకేసారి 216 మంది విద్యార్థులు బృంద నృత్యం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

రథోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

బుగ్గారం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని ఈనెల 13న జరగబోయే శ్రీ నల్ల పోచమ్మ ముత్యాల పోచమ్మ రథోత్సవ పోస్టర్లను సోమవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ధర్మపురి క్యాంప్ ఆఫీసులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పోచమ్మ ఆలయ అభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సా గౌడ్, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నర్సయ్య పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకం

కొడిమ్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల శివాలయంలో పూజారి భాస్కర్ పంతులు ఆధ్వర్యంలో సోమవారం అన్నాభిషేకం చేశారు. వసంత పంచమి పురస్కరించుకొని ఆలయంలో అభిషేకం, పూజలు జరిపారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



కోరుట్ల జ్ఞాన సరస్వతి దేవాలయంలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు



పెద్దపూర్ శివారులోని ఇస్కాన్ ఆలయంలో పూజలు

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని కృష్ణనగర్ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతి దేవి చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. అనంతర్ గర్భిని స్త్రీలకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ స్వరూప, అంగన్‌వాడి టీచర్ స్వప్న పాల్గొన్నారు.

●**జగిత్యాల అగ్రికల్చర్:** పట్టణంలోని స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ మాత విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌టీఏ సభ్యులు కమటాల శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు మార కైలాసం ఉన్నారు.

●**జగిత్యాలరూరల్:** మండలంలోని పొలాస లోని శ్రీలలితామాత ఆలయంలో అమ్మవార్లకు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాలెపు అజయ్, ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూపలు సరస్వతిమాతకు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో చిన్నారులచేత అక్షరాభ్యాసం చేయించారు.

●**కోరుట్ల:** పట్టణంలోని అన్ని దేవాలయాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్ర మాలను జరిపారు. పట్టణంలోని కోటి వనదుర్గ దేవాలయంలో వేదపండితులు పూజలను జరిపారు. పద్మశాలి సంఘం ఆద్వర్యంలో అన్నదానం జరిపారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని జోగినిపల్లి గ్రామంలోని వేంకటేశ్వర దేవాలయంలో వేంకటేశ్వర కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నగా వేములవాడ రాజరాజేశ్వర దేవాయల నుండి దేవాలయ శాఖ అధికారులు స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలను బహూకరించారు.మండలంలోని అన్ని గ్రామాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో, ఆర్యవైశ్య సంఘం మెట్‌పల్లి ఆధ్వర్యంలో వాసవి స్కూల్‌తో పాటు పలు ఆలయాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ద్యావనపల్లి రాజారం, సముద్రాల భానుమూర్తి, బేతు భాస్కర్, ఉడుత శ్రీనివాస్, ఆడెపు రమణ, తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంలోని రాధా గోవర్ధన్ స్వామికి భక్తులు 56రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీ వద్ద గల శ్రీ జ్ఞాన ధ్యాన విజ్ఞాన సరస్వతి ఆలయంలో చిన్నారులకు అక్షరభాస్యం చేశారు. ఆలయ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌రావు, ఈవో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వరలక్ష్మి, సూపర్‌వైజర్ శారధ సమక్షంలో అక్షరభ్యాసం చేశారు. సీఐ రవి, ఎస్సై నరేశ్ భక్తుల రద్దీ పర్యవేక్షించారు.

●**రాయికల్:** పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రగతి ఉన్నత పాఠశాల, విస్డమ్ హైస్కూల్‌లతో పాటు మండలంలోని భూపతిపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలె శేఖర్, కరస్పాండెంట్ ముత్యంపు రాజు రెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1983-84 పదవ తరగతి పూర్వ విద్యార్థులు కొడిమ్యాలలోని శ్రీ సరస్వతి ధ్యాన పీఠంలో వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో, విజ్‌డమ్, విద్యాభారతి పాఠశాల, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. కరస్పాండెంట్లు అరవింద్, అశోక్, పూజారి నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్ వాసవి మాత ఆలయం, దుర్గామాత, శ్రీకనుక సోమేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలను భక్తులు ఘనంగా జరిపారు. ముత్యంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వసంత పంచమి వేడుకల సందర్భంగా విద్యార్థులకు టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు.

●**గొల్లపల్లి:** మండలంలోని పలు ఆలయాల్లో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. సీడీపీవో వీరలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

●**భీమారం:** భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే హోమం, కుంకుమ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లికొండ గణేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట'

పెగడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని నామాపూర్ గ్రామానికి చెందిన అనిరెడ్డి సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఎస్.ఆర్.ఆర్ కరీంనగర్, ఊటూరు గ్రామాల మధ్యన జరిగిన ఫైనల్ పోటీలను లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వీక్షించి టోర్నీలో ఎస్ఆర్ఆర్, ఊటూరు జట్లకు ప్రథమ ,ద్వితీయ ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. అంతకుముందు క్రీడాకారులనుద్దేశించి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, ఓడిన జట్టు మరింత పట్టుదలతో ఆడి విజయం సాదించాలనే తపన పెంచుకోవాలన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ఇంత పెద్ద ఎత్తున టోర్నీని నిర్వహించిన టోర్నీ ఆరగనైజర్లను అభినందించి ఇలాంటి టోర్నీలు మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు, ఫిజికల్ డైరక్టర్ ప్రభాకర్, పార్టీ నాయకులు ఒరుగల శ్రీనివాస్, బుర్ర రాములు గౌడ్, కడారి తిరుపతి, భాస్కర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బీర్‌పూర్,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):చలో హైదారాబాద్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో మాదిగలు కదలి రావాలని జిల్లా అధికారప్రతినిధి బెజ్జంకి సతీష్ పిలుపు నిచ్చారు. సోమవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

●కోరుట్ల: లక్ష డప్పులు వేల గొంతులు కళా ప్రదర్శనను విజయ వంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు పట్టణంలో ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మోర్తాడ్ రాజశేఖర్, శనిగారపు వినోద్, కుంటాల శ్రీను, ఎర్ర శంకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●కథలాపూర్: ఈ నెల 7న వేయి గొంతులు...లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మారంపల్లి వినోద్, రాజం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై యాక్షన్‌ప్లాన్

(5వ పేజీ తరువాయి)

లైన్లు ఏర్పాటు పనులను ప్రారంభించింది. ఇందులో ఇప్పటికే 4 లైన్లను పూర్తి చేయగా, మరో 9 లైన్లకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరో వైపు పలు ప్రాంతాల్లో 11 కేవీ లైన్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. సబ్‌స్టేషన్ల నుంచి పవర్ బయట ట్రాన్స్‌ఫార్మర్లకు సరఫరా చేసే లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అందులో ఇప్పటికే పలు ప్రాంతాల్లో పనులు పూర్తి చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో పనులు నడుస్తున్నాయి.

●మూడు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్న సమయంలో బ్రేక్ డౌన్ జరగకుండా ప్రత్యామ్నాయంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం జగిత్యాల పట్టణంలోని దరూర్ క్యాంపు, విద్యానగర్, హజీపుర, మోతే ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లను గుర్తించారు. కోరుట్లలో పట్టణ సబ్‌స్టేషన్, పెద్ద గుండు సబ్ స్టేషన్, మెట్‌పల్లిలో పట్టణ సబ్ స్టేషన్, వెంకట్రావుపేట సబ్ స్టేషన్లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు నిర్వహించాల్సి వస్తే ప్రత్యామ్నయంగా మరొక సబ్ స్టేషన్ నుంచి విద్యుత్‌ను సేకరించి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్స్‌లో నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

-సాలియా నాయక్, ఎస్ఈ, జగిత్యాల



వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. వ్యవసాయ, గృహ, వాణిజ్య పరమైన విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.7.50 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేపట్టాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పనులు పూర్తి చేశాం. మిగతా పనులు పూర్తి చేసి వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్ రెడ్డి



మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లుగా జిల్లాకు చెందిన ఏలేటి నరేందర్‌రెడ్డి, నలువాల తిరుపతిలను నియమిస్తూ సోమవారం రాష్ట్ర బీజేపీ శాఖ బాధ్యులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కార్యవర్గ జాబితాలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఏలేటి నరేందర్ రెడ్డికి చోటు కల్పించారు. నలువాల తిరుపతి జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందినవారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కొడిమ్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు, కొడిమ్యాల మాజీ జడ్పీటీసీ అల్లుడు, కూతురు డాక్టర్ మిత్ర రావు, డాక్టర్ అర్పిత పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, బుక్కులు సోమవారం అందించారు. అల్పాహారానికి రూ.5 వేలు నగదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ప్రశాంతి, మాజీ సర్పంచ్ కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, ఉపాధ్యాయుడు అంజయ్య, మాజీ ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన మూడవ తెంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025లో జగిత్యాల జిల్లా పోలీసులు తమ ప్రతిభను కనబరిచారు. జిల్లాలో పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజు, ఏఆర్ కానిస్టేబుళ్లు మల్లేశం, నరేందర్, సాయి మాధవన్‌లు వివిధ పోటీల్లో పాల్గొని మూడ రజత, రెండు కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసారు. క్రీడాకారులను ఎస్పీ అభినందించి మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, ఆర్ఐలు కిరణ్ కుమార్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అదినేత నరెందర్ రెడ్డి సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మరియు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌లను సోమవారం మద్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన గెలుపుకు సహకరించ వలసిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అడువాల లక్ష్మణ్, బాల ముకుందం, దూమాల రాజ్‌కుమార్, బోనగిరి నారాయణ, ఎంఏ ఆరీఫ్, రంగు మహేష్, ప్రభాత్ సింగ్ ఠాకూర్, పోతునుక మహేష్, తొలిప్రేమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

కోరుట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : దేవాలయ అభివృద్ధికి తన వంతకు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సోమవారం వసంత పంచమి పురస్కరించుకోని పట్టణంలోని మహాదేవ స్వామి దేవాలయంలో కళ్యాణ భవన నిర్మాణానికి దేవాలయ నిర్వహకులతో కలిసి భూమి పూజను చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం మధు, జాల వినోద్, ప్రభులతో పాలు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

ధర్మపురి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల పురాతన శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో ఆరవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు కొరిడె గుండయ్యశర్మ, కొరిడె నరహరిశర్మ, కొరిడె బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చండీ హోమం, లలిత సహస్రనామ పారాయణం, మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సౌభాగ్యం కోసం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, దేశ్‌ముఖ్‌లు లక్ష్మీకాంతారావు, రంగారావు, కిషన్‌రావు, మాజీ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి చేయూత

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాకు చెందిన రాజమౌళి అనే ఎస్సై 2018లో క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. 2012 పోలీస్ ఎస్సై బ్యాచ్‌కి చెందిన తమ తోటి మిత్రుడు రాజమౌళి కుటుంబాన్ని ఆదుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై బ్యాచ్ మేట్స్ తమ ఉదారతను చాటుకుని రూ. 4 లక్షలను సమకూర్చారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా బుగ్గారం మండలం సిరికొండలో ఉంటున్న రాజమౌళి కుటుంబ సభ్యులకు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, వేణు గోపాల్, కృష్ణా రెడ్డి, రవి, వేణు, రహీం తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయానికి రూ. 50 వేలు విరాళం

పెగడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి మండల కేంద్రానికి చెందిన కాటం సురెందర్ రెడ్డి రమ దంపతులు రూ. 50 వేలు విరాళం సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్‌కు అందజేశారు.

గీత కార్మికుడికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, ఫ్రిబవరి, 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పుల్ల నర్సాగౌడ్ అను గీగ కార్మికుడు ఈత చెట్టుపై నుంచి ప్రమాద వశాత్తు జారీ పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. సోమవారం నర్సయ్యగౌడ్ వృత్తి రీత్యా కల్లు గీయడానికి ఈత చెట్టు ఎక్కడు. కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై జారిపడి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో సమీపంలో ఉన్న గీత కార్మికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గ్రామంలోని ఆసుపత్రికి తరలించారు. నర్సాగౌడ్‌కు రెండు కాళ్లతో పాటు చేతుకు తీవ్ర గాయాలు అయినట్లు గీత కార్మికులు తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రి బ్యాంక్ అందిస్తున్న సేవలను ఖాతదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం గాయత్రి బ్యాంక్ ఖాతదారుడైన ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండపూర్ గ్రామానికి చెందిన పిట్ల నర్సయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గాయత్రి బ్యాంక్ నిర్వయ సేవింగ్ సంబంధించిన ఇన్స్‌రెన్స్ లక్ష రూపాయలు మంజూర్ కాగ చెక్కును నామిన అయిన భార్య పిట్ల జయలక్ష్మీకి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాయత్రి బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కేవ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

జగిత్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ గోడును దరఖాస్తుల రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 37 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీగా ఏర్పాటు చేయాలి

-తిమ్మాపూర్ గ్రామస్థులు

600 ఓటర్లు ఉన్న తిమ్మాపూర్ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తిమ్మాపూర్ గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రఘురాములకోట అనుబంధ గ్రామంగా ఉన్న తిమ్మాపూర్ గ్రామంలో 600 ఎస్సీ ఓట్లు ఉన్నాయన్నారు. రఘురాముల కోటకు చెందిన అగ్రవర్ణాల వారు స్వచ్ఛందంగా ఉండి తమ ఊరిని మాత్రమే అబివృద్ధి చేసి తమ గ్రామాన్ని పట్టించుకోలేదని, ఇకనైనా గ్రామాన్ని గ్రామ పంచాయతీగా చేయడం వల్ల అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలి

-మేడిపల్లి గ్రామస్థులు, మెట్‌పల్లి మండలం

తమ గ్రామానికి మంజూరైన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణాన్ని నిలిపివేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నం చేస్తున్నారని, తమ గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన ఆరోగ్య కేంద్ర నిర్మాణాన్ని ఆపకుండా చూడాలని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

కథలాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయాత్తమవుతున్న నేపథ్యంలో ఈ నెల 4న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ శంకర్ తెలిపారు.

●బీర్‌పూర్,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):సమస్త రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో మంగళవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడివో లచ్చాలు సోమవారం తెలిపారు.

●మల్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాపై అభ్యంతరాల గురించి మంగళవారం మండలంలోని రాజకీయ పార్టీల నేతలతో మండల పరిషత్ కార్యలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు షోకాజ్ నోటీసులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : అక్రమాలకు పాల్పడిన యామపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్నను పదవి నుంచి ఎందుకు తొలగించరాదో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ జిల్లా సహకార అధికారి సిహెచ్ మనోజ్ కుమార్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. యామపూర్ సహకారం సంఘంలో చైర్మన్, అప్పటి సీఈఓలు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తు గతంలో పాలక వర్గంలోని డైరెక్టర్‌లు జిల్లా సహకార అధికారికి, సహకార కమిషనర్ హైదారాబాద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశారు. అక్రమాలలో సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న పాత్ర ఉందని తేలడంతో 37,84,872 లక్షల రూపాయలు రికవరీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు చైర్మన్ అంకతి రాజన్న చైర్మన్ పదవి నుంచి ఎందుకు తొలగించరాదో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ జిల్లా సహకార అధికారి నోటిసులు జారీ చేశారు.

●యామపూర్ సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న, అప్పటి సీఈఓ లు ఇద్దరు కుమ్మకై భారీ ఎత్తున్న నిధులు దుర్వినియోగం చేశారంటూ డైరెక్టర్ కనుక నాగేష్ 2022 సంవత్సరంలో జిల్లా సహకార అధికారికి, సహకార కమిషనర్ హైదారాబాద్‌కు ఫిర్యాదు చేశారు.

కార్యవర్గం ఎన్నిక

మల్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామ సమన్వయ సంఘం నూతన కార్యవర్గంను సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సామ మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా ముల్క మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మోత్కుల నర్సయ్య, గౌరవ అధ్యక్షునిగా కడువ గంగమల్లు, సహాయ కార్యదర్శిగా చింతల తాడెం మల్లేశం, కోశాధికారిగా కమటం రాజేశ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నమనేని అంజన్‌రావు, కొంక మల్లేశం, నర్సయ్యను ఎన్నుకున్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

పెగడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో బంజారా సేవాలాల్ మహారాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్‌కు రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షులు నగావత్ జీవన్ నాయక్, మండల అధ్యక్షులు నగావత్ తిరుపతి నాయక్, సంఘం మండల పెద్దలు అజ్మీరా హరిలాల్ నాయక్ , అజ్మీరా భూమా నాయక్, చిరంజీవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

మల్లాపూర్, ఫ్రిబవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగుంట గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్థంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా ఆలయంలో గ్రామానికి చెందని భైరినేని ప్రదీప్‌రావు, కవిత దంపతులతో పాటు అమృతలచే ధ్వజస్థంభ ప్రతిష్టాపన, యంత్రస్థాపన, అష్ట భలిహరణం, పూర్ణ హుతి, అన్నదాన కార్యక్రమాలను చేయించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ల్లో మకర తోరణ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ధర్మపురి వేదపండింతులచే వైభవంగా జరిపారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలోని మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడేలా బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం హర్షనీయమంటూ మండల బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటంకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బింగి వేణు, గాజుల మల్లేశం, సంఘని రవి, బొట్ల ప్రసాద్, జనగాం రాములు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై ఫిర్యాదు

మల్లాపూర్, ఫ్రిబవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తూ మూగ జీవాలను బలిచ్చే కార్యక్రమాల్లో పాల్గొం టున్న మండలంలోని సాతారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడైన అంబటి భూమేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని జంతు సంరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ రమేష్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.